



సంగారెడ్డి పట్టణంలోని హాస్టల్‌గడ్డ ఈద్గా దారిలో ముస్లింలు



జహీరాబాద్ పట్టణంలో...

ఈద్ ఖుష్

భక్తిశ్రద్ధలతో రంజాన్

- జనసంద్రంగా ఈద్గాలు, మసీదులు
- సామూహిక ప్రార్థనలు
- ఆత్మీయ ఆలింగనంతో శుభాకాంక్షలు తెలుపుకున్న చిన్నాపెద్ద



సంగారెడ్డిలో ఇమాం బోధన

సంగారెడ్డి టౌన్/మెదక్ కల్చరల్/జహీరాబాద్, ఏప్రిల్ 11 : ఈద్గాలో నమాజు.. ఇమాం హదీసులా బోధనలు.. ఆత్మీయ ఆలింగనాలు.. షీర్‌కుర్మా రుచులతో గురువారం రంజాన్ పర్వదినం ఉమ్మడి జిల్లాలో సందడిగా జరిగింది. గ్రామాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నూతనవస్త్రాలను ధరించి, చిన్నాపెద్ద ఉదయమే ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలకు చేరుకున్నారు. ప్రశాంత వాతావరణంలో సామూహికంగా నమాజు చేశారు. అల్లాను ప్రార్థించిన అనంతరం ఇమామ్‌లు ఖుత్బా చదివి వినిపించారు. ప్రపంచమంతా శాంతి వెల్లివిరియాలని, ప్రేమతో మెలగాలని దువా చేశారు. ప్రవక్త బోధనల అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. ఈద్గాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ఇంటింటా ములు షీర్‌కుర్మా తీపిరుచిని ఆస్వాదించారు. అతిథులకు అందించడంతో పాటు తమ చుట్టుపక్కల వారికి, స్నేహితుల కుటుంబాలకు పంపిణీ చేశారు.

కిటకిటలాడిన ఈద్గాలు

సంగారెడ్డి పట్టణంలోని హాస్టల్‌గడ్డకు వేలాదిగా తరలివచ్చిన ముస్లింలతో ఈద్గా ఆవరణ కిటకిటలాడింది. సామూహిక ప్రార్థనలకు ముందు పట్టణంలోని వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని 100 ఫీట్ రోడ్డు నుంచి హాస్టల్‌గడ్డ ఈద్గా దారి జనసంద్రంగా మారింది. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఈద్గా వద్దకు వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని పశువుల మార్కెట్ వద్ద ఉన్న ఈద్గాలో సామూహిక నమాజు నిర్వహించారు. షామియానాలు ఏర్పాటు చేయకపోవడంతో ఉదయం ఎండలోనే ముస్లింలు ప్రార్థనలు చేయాల్సి వచ్చింది. ప్రార్థనలకు వేలాదిగా తరలిరావడంతో ఈద్గా ప్రాంతం జనసంద్రంగా మారింది. ఈద్గా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మాజీ మంత్రి చంద్రశేఖర్, జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొని ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ పట్టణంలోని మున్సిపల్ మాజీ చైర్మన్ షబానాబేగం తంజీం, టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ తదితరుల ఇళ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ పట్టణంలోని ఈద్గా, మసీదులు జనంతో నిండాయి. పట్టణంలోని నవాబ్‌పేట ఈద్గా వద్ద ఉదయం సామూహిక ప్రార్థనలు చేయగా, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అక్కడకు విచ్చేసి ముస్లిం పెద్దలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్ ఈద్గా వద్ద మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



మెదక్‌లో ఈద్గా వద్ద ముస్లింలు



సంగారెడ్డి హాస్టల్‌గడ్డ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఆరోగ్య ఫలం

- ఎండ వేడిమికి పండ్ల రసాలతో ఉపశమనం
- జ్యూస్ సెంటర్‌లపై మక్కువ చూపుతున్న ప్రజలు

7 లో

తూప్రాన్‌లో 305 క్వింటాళ్ల

రేషన్ బియ్యం పట్టివేత

- మహారాష్ట్రకు రవాణా

ఫిర్ ఏక్‌బార్ మోదీ సర్కార్

- అన్ని సర్వేలు బీజేపీ వైపే ఉన్నాయి
- రాష్ట్రంలో 17 స్థానాల్లో గెలుపు ఖాయం
- గోల్‌మాల్ చేసి రేవంత్ సీఎం అయ్యాడు
- మాజీ మంత్రి ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 11 : కాంగ్రెస్ పాలనతో అస్తవ్యస్తంగా మారిన దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిగా గెలిపించుకోవాలని, ఫిర్ ఏక్‌బార్ మోదీ సర్కార్ నినాదాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఉద్ఘాటించారు. గురువారం మెదక్ పట్టణంలోని స్థానిక చిల్డ్రన్ పార్కు మైదానంలో నిర్వహించిన మెదక్ పార్లమెంట్ స్థాయి పోలింగ్ బూత్ కేంద్రాల అధ్యక్షుల సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ రక్షణ, దేశంలో సుస్థిర, సమగ్ర ప్రగతి బీజేపీతోనే సాధ్యమన్నారు. మోదీ నాయకత్వంలో దేశంలో ప్రశాంత పాలన కొనసాగుతుందన్నారు. ఒకే దేశం ఒకే చట్టం నేడు రియాలిటీ అన్నారు. ఆర్థిక రంగంలో దేశం ఐదో స్థానంలో నిలిపిన ఘనత బీజేపీదేనన్నారు. ఒకప్పుడు వీసా ఇవ్వని అమెరికా నేడు మోదీకి రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతుందన్నారు. ముస్లిం మహిళల కోసం ట్రిబుల్ తలాక్‌ను రద్దు చేసిన ఘనత మోదీదేనన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి 12 సీట్లు వస్తాయని, ప్రతి సర్వే చెబుతుందని, కానీ రాష్ట్రంలో 17 స్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గోల్‌మాల్ చేసి.. సోషల్ మీడియాలో వందల కోట్లు ఖర్చు పెట్టి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడని ఈటల రాజేందర్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నప్పటికీ పాలనలో సమన్వయం లేక పంటలు ఎండుతున్నాయన్నారు. మహిళలకు రూ.2500 ఇస్తానని సీఎం రేవంత్ చెప్పి మోసం చేశారన్నారు. వరి పంటకు ఇస్తామన్న రూ.500 బోనస్ ఎక్కడని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ హామీలపై వెంటపడ్తామన్నారు. మల్కాజ్‌గిరిలో డబ్బులిచ్చి పార్టీలోకి జాయిన్ చేసుకుంటున్నారని, అధికారం ఉందని ఇతర పార్టీ నేతలు కాంగ్రెస్‌లోకి వెళుతున్నారని తెలిపారు. పవర్ లేకున్నా ఏళ్ల తరబడి పని చేస్తున్న నికార్సయిన కార్యకర్తలు బీజేపీ సొంతమన్నారు.

రాహుల్ గాంధీని చూస్తే ఓట్లు పడవు

కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా సగం సీట్లలో కూడా పోటీ చేయడం లేదని, రాహుల్‌గాంధీని చూస్తే ఓట్లు పడవని సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ విమర్శించారు. దేశంలో 2014తోనే సంకీర్ణ శకం ముగిసిందన్నారు. మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి గొప్ప అవినీతి పరుడని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ గాలి వీస్తోందని, 12 స్థానాలకు తగ్గకుండా బీజేపీ అభ్యర్థులను పార్లమెంట్‌కు పంపుదామని ఆయన పిలుపునిచ్చారు. మూడోసారి ప్రధానిగా మోదీ గెలవగానే పెండింగ్ పనులను పూర్తి చేసుకుందామన్నారు.

ప్రత్యర్థుల డిపాజిట్లు గల్లంతు కావాలి

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రత్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యేలా పార్లమెంట్ పరిధిలోని 2,112 మంది బూత్‌స్థాయి అధ్యక్షులు పని చేయాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు కోరారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అధ్యాయనం ముగిసిపోతుందన్నారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఎమ్మెల్సీ అయిన వెంకట్రామారెడ్డి, ఆయనకు కేటాయించిన రూ.5 కోట్ల నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వనోడు వంద కోట్లతో స్కూల్, ఆసుపత్రి పెడుతానని అబద్ధాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశాడు. వరి వేస్తే ఉరి అన్న వెంకట్రామారెడ్డి మెదక్‌కు వచ్చి రైతులను ఎలా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ మోసకారి పార్టీ అని, ఆ పార్టీని మెదక్ ప్రజలు మర్చిపోయి 20 ఏళ్లు అవుతుందన్నారు. నాలుగు పార్టీలు మారిన వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఎప్పుడు జైలుకు పోతాడో తెలియదన్నారు. నరేంద్రమోదీ హ్యాట్రిక్ కొట్టడం పక్కా అని, మెదక్‌లో బీజేపీ గెలువడం కూడా అంతే పక్కా అన్నారు. మన బలం బలగం కార్యకర్తలేనని, మనందరి బలం మోదీ అని అన్నారు. అనంతరం పలు పార్టీల నేతలు బీజేపీ చేరారు. ఈ సమావేశంలో మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి బస్వ లక్ష్మీనర్సయ్య, కన్వీనర్ సంగమేశ్వర్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, గోదావరి అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, విస్తరక్ రుషీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, పరిణీత, మురళీయాదవ్, నాయకులు విజయ్, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, ఏడు నియోజకవర్గాల బూత్‌స్థాయి అధ్యక్షులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూలే అడుగుజాడల్లో పయనించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావుపూలే గొప్ప విద్యావేత్త, సామాజిక తత్వవేత్త, సంఘ సేవకుడని, ఆయన అడుగుజాడల్లో నడవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం పూలే జయంతిని పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ, ఆడపిల్లలు చదువుకోవాలనే విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది మొదటగా జ్యోతిబాపులే సతీమణి సావిత్రిబాయిపూలేనని గుర్తుచేశారు. కుల వ్యవస్థలో లోపాలను గుర్తించి ఆనాడే సామాజిక సమానత్వం సాధన కోసం జ్యోతిబాపూలే సంస్కరణల కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. దళిత, బహుజన మహిళల అభ్యున్నతి కోసం శ్రమించిన తీరు, వారు ఆచరించిన కార్యాచరణ మహోన్నతమైందన్నారు. మహనీయులు చరిత్రను తెలుసుకొని వారి ఆశలు, ఆశయాల కనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా గురుకుల, వసతిగృహ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. ఈ కార్యక్రమంలో అదనపు బీసీ అధికారి నాగరాజుగౌడ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దొంత నరేందర్, రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, వసతి గృహ సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.





పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, సంగారెడ్డిలో జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి : అదనపు కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 11 : మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. గురువారం మహాత్మాజ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డిలోని ఆయన విగ్రహానికి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని భావించి, పూలే కార్యోన్ముకులు అయ్యారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీశ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్హేర్/నారాయణఖేడ్/పెద్దశంకరంపేట, ఏప్రిల్ 11 : ఉగాది పండుగను పురస్కరించుకుని కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట్‌లో, నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ మత్తడి పోచమ్మ జాతర మహోత్సవంలో, పెద్దశంకరంపేట మండల పరిధిలోని బుజరంపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన పోటీలు భక్తులను అలరించాయి. బీబీపేట్‌లో ఈ ప్రాంతానికే చెందిన వారే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు ఈ పోటీల్లో పాల్గొనడంతో పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఫైనల్ కుస్తీ పోటీలో అంతారం గ్రామానికి చెందిన గంగారాం విజేతగా నిలవగా ఆయనకు 10 తులాల వెండి కడియాన్ని ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండు నరేందర్, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారి సాయిలు, కల్హేర్ ఏఎస్ఐ అంజయ్య, బీఆర్ఎస్ నాయకుడు కిషన్‌రెడ్డి బహూకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కల్హేర్ మండల అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుండు మోహన్, నాయకులు సంతోష్‌రెడ్డి, గూల రవి తదితరుల పాల్గొన్నారు. మంగల్‌పేట్ మత్తడి పోచమ్మ, దుర్గ భవాని అమ్మవార్ల ఉత్సవాల్లో కుస్తీ పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన మలయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. భక్తులు కుస్తీ పోటీలను తిలకిస్తూ ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. అంతిమ విజేతగా నిలిచిన మల్లయోధుడికి తులం వెండి కడియాన్ని బహూకరించారు. బుజరంపల్లి వెంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లాకు చెందిన మల్లయోధులతో పాటు సమీపంలోని కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు తలపడ్డారు. విజయం సాధించిన మల్లయోధులకు గ్రామ మాజీ సర్పంచ్ బూరెమ్మ విఠల్, ఆలయ కమిటి బాధ్యులు బహుమతులను ప్రదానం చేశారు.



బీబీపేట్‌లో వెండి కడియం అందుకుంటున్న మల్లయోధుడు

హోరాహోరీగా కుస్తీ పోటీలు

- బీబీపేట్‌లో విజేతకు పది తులాల వెండి కడియం బహూకరణ
- మత్తడి పోచమ్మ ఉత్సవాల్లో విజేతకు తులం వెండి కడియం





మంగల్‌పేట్‌లో కుస్తీ పడుతున్న మల్లయోధులు, బుజరంపల్లిలో నిర్వహిస్తున్న కుస్తీ పోటీ



ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు

- ఆర్టీసీ కార్గో ద్వారా పంపిణీ
- రూ.151 చెల్లిస్తే తలంబ్రాలు బుకింగ్
- ఈ నెల 18 వరకు బుకింగ్‌కు అవకాశం

7 లో

దుబ్బగుట్ట ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

టేక్మాల్, ఏప్రిల్ 11: దుబ్బగుట్ట ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మండలంలోని ధనుర గ్రామ శివారులో కొనసాగుతున్న దుబ్బగుట్ట జాతరలో భాగంగా గురువారం వేంకటేశ్వరస్వామి అలిమేలుమంగా పద్మావతిల కల్యాణోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి గుట్ట పైనుంచి పల్లకిలో మోసుకుంటూ కల్యాణ మండపంలోకి తీసుకొచ్చారు. కల్యాణం అనంతరం మంత్రిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ మెంబర్ యాసుఫ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మ రమేష్, నాయకులు సత్యనారాయణ, మల్లారెడ్డి, మాన్‌కిషన్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజగౌడ్, కిషోర్, సాగర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పార్లమెంట్ నుంచి పోటీచేస్తా

● అంబికా శివయోగి మహరాజ్



విలేకరులతో మాట్లాడుతున్న అంబికా శివయోగి మహరాజ్

రేగోడు, ఏప్రిల్ 11: హిందూ ధర్మం, సనాతన సిద్ధాంతాల కోసం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నేషనల్ మహాసభ పార్టీ తరఫున పోటీ చేస్తానని దుద్యాల సర్వేశ్వరపురి పీఠాధిపతి అంబికా శివయోగి మహరాజ్ అన్నారు. మంగళవారం రాత్రి దుద్యాల ఆశ్రమానికి వెళ్తూ రేగోడులో విలేకరులతో మాట్లాడారు. నేషనల్ మహాసభ పార్టీ రాష్ట్రంలోని సికింద్రాబాద్, మెదక్, భువనగిరి, జహీరాబాద్ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిందని, అందులో జహీరాబాద్ నుంచి తన పేరు ప్రకటించడం గర్వంగా ఉన్నదన్నారు. ఓట్ల కోసం నాయకులు మోసపూరిత వాగ్దానాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. హిందువుల ధర్మం కోసం పోరాడతానని, అందరికీ ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఉపాధి కల్పన, పరిశ్రమలు ఏర్పాటు, నదులకు దగ్గరలో ఉన్న ఆలయాల వద్ద ఘాట్ల ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

వాచ్‌మన్లపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి



వాచ్‌మన్‌ను విచారిస్తున్న పోలీసులు

శివ్వంపేట, ఏప్రిల్ 11: ఫాంహౌస్‌లోకి చొరబడ్డ గుర్తు తెలియని వ్యక్తులు వాచ్‌మన్లపై దాడిచేసి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన గురువారం పిల్లుట్లలో చోటు చేసుకున్నది. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన శైలేందర్‌గుప్తా రెండు ఎకరాల పది గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి ఫాంహౌస్ నిర్మించాడు. బుధవారం రాత్రి ఇద్దరు వాచ్‌మన్లు నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు చొరబడి దాడిచేసి సెల్‌ఫోన్లను అపహరించుకుపోయారు. సీసీ కెమెరాలను, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేశారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్ఐ మహిపాల్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్య ఫలం

● ఎండ వేడిమికి పండ్ల రసాలతో ఉపశమనం ● జ్యూస్ సెంటర్లపై మక్కువ చూపుతున్న ప్రజలు



హుస్నాబాద్‌లో చెరకు జ్యూస్ తాగుతున్న యువకులు



హుస్నాబాద్‌లో పుచ్చకాయలు కొనుగోలు చేస్తున్న జనం



తర్బూజా

హుస్నాబాద్, ఏప్రిల్ 11: తీవ్రమైన ఎండలతో ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ఈ ఎండలకు ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. వేసవి తాపానికి పండ్లతో పాటు పండ్ల రసాలు ఎంతో మేలు చేస్తాయి. వాతావరణంలోని అధిక ఉష్ణోగ్రతలకు శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించడం, జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేయడం.. ఇలా పలు రకాలుగా పండ్లు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఈ నేపథ్యంలో వేసవిలో లభించే పండ్లు.. వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుందాం..

కీర దోసకాయ

చూడగానే తినాలనిపించే కీర దోసకాయ వేసవిలో ఎంతో ఉపయోగపడుతుంది. దానిలోని పుష్కలమైన పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. రీహైడ్రెటింగ్ ఏజెంటుగా పనిచేస్తున్నది. పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉండటంతో రక్తపోటుతో బాధపడే వారికి ఇది చక్కని ఆహారం. చెమట ద్వారా కోల్పోయిన నీటిని, లవణాలను శరీరానికి తిరిగి అందించడంతో కీరదోస చక్కని పాత్ర పోషిస్తుంది. ఇందులో విటమిన్ ఏ, నీలు పుష్కలంగా ఉంటాయి. శక్తి కిలో కెలోరిలు 13, మాంస కృతులు 0.4 గ్రా, కార్బోహైడ్రెట్స్ 2.5 గ్రా, కొవ్వు పదార్థాలు 0.1గ్రా, పీచు పదార్థాలు 2.6 గ్రా, సోడియం 10.2మి.గ్రా, పొటాషియం 50 మి.గ్రా ఉంటాయి.

శరీరంలో వేడిని తీసే తర్బూజ



తర్బూజ శరీరంలోని వేడిని తీసివేస్తుంది. వేసవిలో చల్లదనాన్ని ఇస్తుంది. వేసవిలోనే ఎక్కువగా లభించే తర్బూజాలో 95.9 శాతం నీరు ఉంటుంది. ఇందులో కాల్షియం, పిండి పదార్థాలు, ఫాస్పరస్, మాంస కృతులు, ఇనుము, సోడియంలు ఉంటాయి. మూత్ర సంబంధ వ్యాధులను నయం చేస్తుంది. చర్మవ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది.

క్రిములను నాశనం చేసే పైనాపిల్

పైనాపిల్‌లో నీరు 86.5 శాతం ఉంటే విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బీ, చక్కెర, ఇనుము, మాంస కృతులు ఉంటాయి. పొట్టలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను దూరం చేస్తుంది. పేగుల్లోని క్రిములను నాశనం చేస్తుంది.

వేసవిలో ఆరోగ్యాన్నిచ్చే పండ్లు ఎన్నో..

ఇవే కాకుండా వేసవిలో ఇంకా ఎన్నో పండ్లు ఆరోగ్యాన్ని కాపడుతాయి. సపోట, అరటి, కమల పండు, నేరేడు, జామ, బొప్పాయి, పండ్లలో లభించే ఎ విటమిన్ ఎంతో ఉపయోగపడుతుంది. చెరుకు రసం వేసవిలో ఆరోగ్యానికి మేలు. పండ్లకంటే పండ్ల రసాలు ఎంతో ఉపయోగపడుతాయి.

ఆరోగ్యానికి నిమ్మతో మేలు



వేసవిలో నిమ్మ రసం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో విటమిన్ సి కలిగి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీనిలో ఉండే పదార్థాలు కెన్సర్ రాకుండా చేస్తాయి. నిమ్మరసం సేవిస్తే కాలేయం శుభ్ర పడుతుంది. చర్మ సౌందర్యానికి ఉపయోగపడుతుంది. ఇందులో శక్తి 30కి క్యాలరీస్, పిండి పదార్థాలు 9 గ్రా. చక్కెరలు 2.5 గ్రా, పీచు పదార్థాలు 2.8 గ్రా, కొవ్వు పదార్థాలు 0.3 గ్రా, మాంస కృతులు 11 గ్రా, నీరు 89 గ్రా, విటమిన్ సి 53 ఎంజి ఉంటుంది.

వేడి, నీరసాన్ని తగ్గించే ద్రాక్ష



ద్రాక్ష వేడి, నీరసాన్ని తగ్గిస్తుంది. ఆరోగ్యానికి ఈ పండ్లు ఎంతో ముఖ్యమైనవి. ఇందులో కాల్షియం, సోడియం, పొటాషియంలతో పాటు నీరు 88.5 శాతం, పాస్పరస్ 0.02, పిండి పదార్థాలు 10.2 ఇనుము 0.4, మాంసకృతులు 0.6, కాల్షియం 0.03, విటమిన్ ఎ 151 ఐయూ, విటమిన్ బి 10.3, విటమిన్ సి 10 మి.గ్రాములుంటాయి. ద్రాక్ష మలబద్ధకాన్ని, ఫైల్స్‌ను నివారిస్తుంది. మూత్ర సంబంధిత వ్యాధులను తగ్గించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. క్యాన్సర్ నివారణకు కూడా ఉపయోగపడుతుంది. బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది.

శక్తినిచ్చే కొబ్బరిబోండాం



వేసవిలో కొబ్బరి బోండాం ఎంతో శక్తినిస్తుంది. వేడిని తగ్గించడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. ఎండాకాలంలో ఎక్కువగా దొరికే కొబ్బరిబోండాల్లో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ కాలంలో ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుంది. పిల్లలకు కొబ్బరి బోండాలు వేసవిలో ఆరోగ్యంగా ఉంచడానికి ఉపయోగపడుతాయి.

మామిడి పండుతో లాభాలెన్నో



పండ్లలో రాజు అయిన మామిడి పండుతో లాభాలు అన్నీ ఇన్ని కావు. పండిన మామిడిలో 12గ్రా పిండి పదార్థాలు, కాల్షియం 17 మి.గ్రా, మాంస కృతులు 0.6, పాస్పరస్ 20, కొవ్వు పదార్థాలు 0.1, ఇనుము 0.8, విటమిన్ ఎ 4,800 నుంచి 22,550 ఐయూ, పొటాషియం 250, విటమిన్ బి1 42,755, సోడియం 7, విటమిన్ బి250, నియాసిన్ 0.3, విటమిన్ సి 150 గ్రాములు ఉంటాయి. ఇందులో సిట్రిక్ యాసిడ్‌తో పాటు పిప్పి పదార్థాలుంటాయి. దీంతో మలబద్దక నివారణతో పాటు కాలేయం, పేగులు చురుకుదనంగా పనిచేయడానికి ఉపయోగపడుతుంది.

నీరు అధిక శాతం ఉండే పుచ్చకాయ



పుచ్చకాయ(వాటర్ మిలన్) అధిక శాతం నీరు ఉంటుంది. ఇది వేసవిలో దాహార్తిని తీర్చుతుంది. ఇందులో కాల్షియం, ఇనుము, సల్ఫర్, కాపర్‌లు ఎక్కువగా ఉంటాయి. రక్త హీనతను తగ్గించడంతో పాటు మల బద్దకాన్ని దూరం చేస్తుంది. కడుపులో మంటను అరికడుతుంది.



దానిమ్మతో జ్వరానికి చెక్

జ్వరం తగ్గడానికి దానిమ్మ పండు ఎంతో ఉపకరిస్తుంది. ఈ పండు తేలిగ్గా జీర్ణమవుతుంది. ఇందులో 78శాతం నీరు ఉంటుంది. విటమిన్ సి 16 మి.గ్రా, పిండి పదార్థాలు 14.5, కాల్షియం 0.01, మాంసకృతులు 1.7, పాస్పరస్ 0.7, ఇనుము 0.03, విటమిన్ బి 10 మి.గ్రా ఉంటుంది. గుండెపోటుకు, మల్ల బద్ధకాన్ని నివారిస్తుంది.

మల్లన్న ఆలయ సూపరింటెండెంట్ శేఖర్ రిలీవ్

● డిప్యూటేషన్‌పై కొండగట్టుకు..



సూపరింటెండెంట్ శేఖర్‌ను సత్కరిస్తున్న ఈవో బాలాజీశర్మ

చేర్యాల, ఏప్రిల్ 11: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సూపరింటెండెంట్ నీల శేఖర్‌ను కొద్దిరోజుల క్రితం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేసిన నేపథ్యంలో గురువారం రిలీవ్ చేశారు. చాన్నాళ్లకాలంగా మల్లన్న ఆలయంలో పనిచేస్తున్నాడన్న కారణంగా దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదులందడంతో ఏడాదికాలం పాటు డిప్యూటేషన్‌పై కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి బదిలీ చేస్తూ గత మార్చి 14న దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. కానీ ఆ సమయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నందున కార్యకలాపాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతాయని నిలుపుదల చేశారు. ఇటీవల జాతర ముగియడంతో ఎట్టకేలకు గురువారం రిలీవ్ చేశారు. ఈవో బాలాజీశర్మ, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఉద్యోగులు, అర్చకులు సన్మానించి వీడ్కోలు పలికారు.

గ్రూప్ సర్వీస్‌లకు ఉచిత శిక్షణ

● జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి



అఖిలేష్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 11: సంగారెడ్డిలోని సమీకృత బాలుర వసతి గృహంలో గ్రూప్-1,2,3,4 సర్వీస్‌లకు మూడునెలల ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్ రెడ్డి తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ విద్యార్థులు నేరుగా స్టడీ సెంటర్‌కు వచ్చి అడ్మిషన్ పొందాలని సూచించారు. అడ్మిషన్ పొందిన వారికి ఉచితంగా హాస్టల్ వసతి కల్పించడంతో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9440478004, 9393941575 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తవ్వకాల్లో బయటపడిన శిలాతోరణం



తవ్వకాల్లో బయటపడిన గ్రామదేవతల శిలాతోరణం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 11: జిల్లా కేంద్రంలోని కుమ్మరిగల్లిలో గ్రామదేవతల పురాతన శిలాతోరణం బయటపడింది. స్థానిక రాందాస్ చౌరస్తా నుంచి దాయర వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా తవ్వకాలు చేపట్టారు. రాళ్లు తొలగిస్తున్నప్పుడు గ్రామదేవతల శిలాతోరణం బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పూజలు చేశారు. ఇంకా భూమిలో ఆరు విగ్రహాలు ఉన్నట్లు అనుమానిస్తున్నామని, అన్ని బయటకు తీయాలని అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. దాదాపు వందేళ్ల నాటివిగా భావిస్తున్నట్లు కాలనీవాసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో పాటు పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కంకోలు గ్రామానికి చెందిన మంగలి సురేష్((29) బతుకుదెరువు కోసం భార్య స్వప్నతో కలిసి నగరానికి వచ్చి గాజులరామారం ప్రాంతంలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయంలో కార్పెంటర్‌గా పనికి వెళ్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. భార్య పుట్టింటికి వెళ్లి ఎంతకీ తిరిగిరాలేదు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ ఫిబ్రవరి 26న తాగిన మైకంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గుర్తించి మంటలు ఆర్పి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు

● రూ.151 చెల్లిస్తే తలంబ్రాలు బుకింగ్
● ఈ నెల 18వ తేదీవరకు బుకింగ్‌కు అవకాశం
● ఆర్టీసీ కార్గో ద్వారా పంపిణీ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 11: భద్రాద్రి రాములోరి తలంబ్రాలు కావాలనుకునే భక్తుల కోసం ఆర్టీసీ చర్యలు చేపట్టింది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించే సీతా రామచంద్రస్వామి కల్యాణానికి వెళ్లలేని భక్తులు ఇంటి వద్దే తలంబ్రాలను పొందేలా ఆర్టీసీ చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా ఆర్టీసీ కార్గో ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించింది. అయితే ఈనెల 18వ తేదీ వరకు తలంబ్రాలు బుకింగ్ చేసుకునే అవకాశం ఆర్టీసీ కల్పించింది. టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకుని తలంబ్రాలు బుక్ చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. గతేడాది ఆర్టీసీ ఇదే తరహాలో రాములోరి కల్యాణ తలంబ్రాలను భక్తులకు ఇంటి వద్దకే అందించగా, ఆ క్రమంలో భక్తుల నుంచి అనూహ్య స్పందన రావడంతో.. తాజాగా ఈ యేడు కూడా పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించింది.

తలంబ్రాల కోసం డిపోల వారీగా..

తలంబ్రాల కోసం మెదక్ డిపో-9154298642, నారాయణఖేడ్-9154298648, సంగారెడ్డి-9154298652, జహీరాబాద్-9154298657, సిద్దిపేట-9154298660, దుబ్బాక-9154298664, గజ్వేల్-9154298668, ఆర్‌ఎం ఆఫీసు-9154298674, ఏటీఎం లాజిస్టిక్స్-8125456978 నంబర్లను సంప్రదించాలని అధికారులు తెలిపారు. గతేడాది ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో 9,614 మంది తలంబ్రాలు బుక్ చేసుకోగా రూ.11,15,224 ఆదాయం వచ్చిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ సారి కూడా అదే తరహాలో ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.



భద్రాద్రి రాములోరి తలంబ్రాలు(ఫైల్)

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బుకింగ్



తలంబ్రాలు ఆన్‌లైన్(టీఎస్‌ఆర్టీసీలాజిస్టిక్.ఇన్), ఆఫ్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చు. దూర ప్రాంతాల్లో ఉండి భద్రాచలంలో జరిగే రాములోరి కల్యాణానికి వెళ్లలేని భక్తులకు ఇది సువర్ణ అవకాశం. రాములోరి కల్యాణ తలంబ్రాలు ఎంతో పవిత్రమైనవి. తలంబ్రాలు పొందిన వారికి అంతా శుభమే జరుగుతుందనే భక్తులు నమ్ముతుంటారు. ఈ నెల 18వ తేదీవరకు సంబంధిత కార్గో లాజిస్టిక్ కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకుని డోర్ డెలివరీ ద్వారా తలంబ్రాలు పొందండి.

- ఉపేందర్, డిపో మేనేజర్, సంగారెడ్డి

ఒకేచోట కూర్చున్నా.. మాట్లాడుకోని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



నర్సాపూర్‌లో ఒకేచోట పక్కపక్కనే నిల్చున్న ఎమ్మెల్యే సునితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 11: మొన్నటివరకు ఏ కార్యక్రమంలోనైనా కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే సునితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఇప్పుడు ఒకేచోట పక్కపక్కనే కూర్చున్నా మాట్లాడుకోకుండా ఉండటం విశేషం. నాలుగు నెలల క్రితం జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో సునితారెడ్డి గెలుపుకోసం పనిచేసిన మదన్‌రెడ్డి.. ఇప్పుడు ఎడమొహం.. పెడమొహం పెట్టుకోవడానికి రాజకీయ పరిణామాలే కారణమని చెప్పవచ్చు. మదన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడానికి నిర్ణయించుకున్నారు. కాగా గురువారం నర్సాపూర్ ఈద్గా వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపేందుకు ఇద్దరూ వచ్చి పక్కపక్కనే కూర్చున్నా.. ఒకరినొకరు పలకరించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా ఎమ్మెల్యే సునితారెడ్డి కూర్చున్నచోటనే మాజీ ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తదితరులు ఉన్నారు. వీరూ ఎవరికివారు పలకరించుకోకుండా శుభాకాంక్షలు తెలిపి వెళ్లడం విశేషం.

కొనసాగుతున్న బీరప్పస్వామి ఉత్సవాలు



కలశ పూజ నిర్వహిస్తున్న భక్తులు

వట్‌పల్లి, ఏప్రిల్ 11: మండల పరిధిలోని మేడుకుందలో బీరప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన రెండోరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జలదివాసం, పుష్పదివాసం, దానదివాసం, కలశ పూజ, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఇమామ్‌నగర్‌లో మల్లన్న జాతర



మల్లన్న జాతరలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్

జిన్నారం, ఏప్రిల్ 11: సోలక్‌పల్లి పరిధి ఇమామ్‌నగర్‌లో మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. గురువారం మల్లన్న ఆలయం వద్ద స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అంజనేయులు, రాజేష్, భార్గవ్, కృష్ణ, పరమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి, ఒకరి మృతి



శ్రీధర్‌రెడ్డి(ఫైల్)

కౌడిపల్లి, ఏప్రిల్ 11: బైక్ అదుపు తప్పి కింద పడి ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన మండల పరిధిలోని బుజరంపేట్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. కామారెడ్డి జిల్లా కుండారం గ్రామానికి చెందిన బండారి శ్రీధర్‌రెడ్డి 25 ఏళ్ల క్రితం మండలంలోని బుజరంపేటకు వచ్చి ఆర్‌ఎంపీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 8 గంటలకు కొల్చారం మండల పరిధిలోని దుంపలకుంటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర వాసి మృతి



మృతిచెందిన సురేష్

తూప్రాన్, ఏప్రిల్ 11: రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర వాసి గురువారం మృతిచెందాడు. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా డేగ్లూర్ మండలం హవర్గాకు చెందిన బర్‌సంవార్ సురేష్(45), అయిలాబాయి దంపతులు నాలుగేళ్ల క్రితం సుచిత్రకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. గురువారం ఉదయం 4 గంటలకు సురేష్ స్వగ్రామం వెళ్లేందుకు సుచిత్ర వద్దకు వచ్చి కామారెడ్డి వైపు వెళ్తున్న కారులో బయలుదేరాడు. తూప్రాన్ పట్టణ శివారులోని టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న కంటైనర్ లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. కామారెడ్డి జిల్లా పోశన్‌పేట్‌కు చెందిన కారు డ్రైవర్ షాదుల్లా అనిల్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుడు సురేష్ భార్య అయిలాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గుమ్మడిదలలో యువతి అదృశ్యం



ఘరమణి(ఫైల్)

గుమ్మడిదల, ఏప్రిల్ 11: గుమ్మడిదలలో ఓ యువతి అదృశ్యమైంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గుమ్మడిదల గ్రామంలో నివాసముంటున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఘరమణీ అన్నారం గ్రామ శివారులో ఉన్న మోల్ టెక్ పరిశ్రమలో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నది. ఈనెల 10న రోజులాగే పరిశ్రమలో పనికి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి మాయారామ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తూప్రాన్‌లో వ్యాపారి..

తూప్రాన్, ఏప్రిల్ 11: తండ్రి మందలించడంతో వ్యాపారి ఇంట్లోంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో బుధవారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన మహ్మద్‌గౌస్, అతడి కుమారుడు మహ్మద్ ఫయాజ్(37)లు వ్యాపారం నిర్వహిస్తున్నారు. తమ వద్ద పనిచేసే వ్యక్తులు చెల్లింపులు చేయకపోవడంపై కుమారుడు ఫయాజ్‌ను బుధవారం తండ్రి గౌస్ మందలించాడు. దాంతో ఉదయం 11 గంటలకు కొంపెల్లి వద్ద డబ్బులు తీసుకొస్తానంటూ బైక్‌పై వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ అని రావడంతో చుట్టుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తూప్రాన్‌లో 305 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● మహారాష్ట్రకు రవాణా



తూప్రాన్ వద్ద పట్టుకున్న రేషన్ బియ్యం

తూప్రాన్, ఏప్రిల్ 11: అక్రమంగా తరలిస్తున్న 305 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తూప్రాన్ పట్టణ పరిధి టోల్‌ప్లాజా వద్ద గురువారం పట్టుకున్నారు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి లారీలో 280 క్వింటాళ్లు, మరో మినీ వాహనంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు రవాణా చేస్తున్నారు. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద ఎస్‌ఐ శివానందం ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టగా, రెండు వాహనాల్లోని 305 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. పట్టుబడిన బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ ప్రణీతారెడ్డికి అప్పగించినట్లు ఎస్‌ఐ వివరించారు. లారీ డ్రైవర్ నీరజ్‌కుమార్, యజమాని భాస్కర్‌రెడ్డి, చింతయ్యలపై, మినీ వాహనం డ్రైవర్ బాలాజీ, వాహన యజమాని తేజావత్ రవిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం పేర్కొన్నారు.

18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కొండపాక, ఏప్రిల్ 11: అక్రమంగా నిల్వచేసిన 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. కొండపాకకు చెందిన తిరుపతి సాయికృష్ణ తన ఇంట్లో అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని దాచిపెట్టాడు. నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కుకునూరుపల్లి పోలీసులతో కలిసి దాడులు చేసి 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

● 4,200 లీటర్ల విస్కీ బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న టూటౌన్ పోలీసులు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 11: సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కరీంనగర్ రోడ్డు హనుమాన్‌నగర్‌లో దండుగుల స్వప్న తన కిరాణా షాపులో అనుమతి లేకుండా బెల్ట్‌షాపు నడుపుతున్నదని సమాచారం రావడంతో గురువారం సాయంత్రం సిద్దిపేట టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 4,200 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్ మాట్లాడుతూ ఇళ్లలో, హోటళ్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో, కిరాణా షాపులలో, ఇతర దుకాణాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్‌షాపులు నడిపితే సమాచారం అందించాలని కోరారు.



జహీరాబాద్: ఈద్గావద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



పటాన్‌చెరు: ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డికి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు



రామచంద్రాపురం: ముస్లింలకు ఈద్ ముబారక్ తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



గుమ్మడిదల: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఘనంగా రంజాన్ వేడుకలు



వట్‌పల్లి: వెంకట ఖ్వాజా ఆశ్రమంలో పీఠాధిపతికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు



సిర్గాపూర్‌లో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మునిపల్లి: పెద్దచెల్మెడ ఈద్గా వద్ద చిన్నారుల ఆత్మీయ ఆలింగనం

రంజాన్ పర్వదినాన్ని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా గురువారం ఉదయాన్నే తమ సమీపంలోని ఈద్గాలకు నూతన వస్త్రాలు ధరించి వెళ్లారు. ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించి ఆత్మీయ ఆలింగనాలతో పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం తమ బంధుమిత్రులను ఇళ్లకు ఆహ్వానించి ప్రత్యేకంగా షీర్‌కుర్మాతో విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లింలకు ఈద్ ముబారక్ చెప్పారు. పట్టణ ప్రాంతాల్లోని సామూహిక ప్రార్థనలు జరిపే ఈద్గాల వద్ద పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 11



కంగ్టి మండలంలోని తడ్కల్‌లో ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు



ఖేడ్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సురేష్‌షెట్కార్



పటాన్‌చెరు: ఈద్గావద్ద నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



నిజాంపేట: ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు




మెదక్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, ఎమ్మెల్సీ



చేగుంటలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయ ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు



మెదక్‌లో ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



చిన్నశంకరంపేట ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



తూప్రాన్‌లో ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్లు, నాయకులు



మనోహరాబాద్: కాళ్లకల్ మసీదులో వేడుకలు

నిజాంపేటలో యథేచ్ఛగా ఇసుక అక్రమరవాణా



ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ట్రాక్టర్

నిజాంపేట, ఏప్రిల్ 11: మండలంలో అధికారుల అండగా అక్రమార్కులు నీటి వనరులను కొల్లగొడుతూ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కల్వకుంట, దుబ్బాక మండలం తాళ్లపల్లి గ్రామాలను ఆనుకుని ఉన్న వాగులో నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా కల్వకుంట గ్రామానికి చెందిన వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు అధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లను చెప్పుకుంటూ రాత్రి సమయాల్లో ఇసుకను తోడేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు. పెద్ద ఎత్తున ఇసుక నిల్వలను డంప్ చేసి యథేచ్ఛగా సందర్భాన్ని బట్టి ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఈ విషయమై తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ ప్రాంతం నుంచి ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలించినా, డంప్ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గురుకులంలో టీఎస్ఈఐ సెక్రెటరీ తనిఖీ



తరగతి గదిలో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న రమణ కుమార్

మునిపల్లి, ఏప్రిల్ 11: మండల పరిధిలోని లింగంపల్లి గురుకుల పాఠశాలను గురువారం టీఎస్ఈఐ సెక్రెటరీ రమణ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మరుగుదొడ్లు, వంటశాలను పరిశీలించి పాఠశాలలో సమస్యలు, భోజనం, బోధనకు తదితర విషయాల గురించి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఎల్ అండ్ టీ సహకారంతో నూతనంగా నిర్మించిన బిల్డింగ్‌ను పరిశీలించి సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఆయన వెంట పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్య, డిప్యూటీ వార్డెన్ హైమా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రచార రథాలను ప్రారంభించిన చింతా



సంగారెడ్డి శివాలయం వద్ద ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతా

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 11: పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్దపీట వేస్తుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గానికి కేటాయించిన నాలుగు ప్రచార రథాలను గురువారం సంగారెడ్డిలోని శివాలయం వద్ద ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, రాజేందర్, విజేందర్‌రెడ్డి, విఠల్, నాగరాజ్‌గౌడ్, నర్సింహులు, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** మండల కేంద్రమైన వెల్దుర్తిలో బీఆర్ఎస్ ప్రచార రథాన్ని గురువారం వెల్దుర్తి ఎంపీటీసీ మోహన్‌రెడ్డితో కలిసి జడ్పీటీసీ రమేష్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



టేక్మాల్: ఎల్లుపేటలో బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

జహీరాబాద్, ఏప్రిల్ 11: జహీరాబాద్ ఎంపీగా బరిలో ఉన్న బీబీపాటిల్ గెలుపునకు సమష్టిగా కృషిచేద్దామని జిల్లా నాయకులు అరుణా కౌళాస్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు విశ్వనాథ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బాగారెడ్డిపల్లి, తదితర ప్రాంతాల్లో తిరిగి ఓటర్లను కలిసి బీబీపాటిల్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పూల సంతోష్, క్రిష్ణారెడ్డి, అప్పం శ్రవణ్, శోభ, మంజులాకౌళాస్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట/టేక్మాల్/ అల్లాదుర్గం, ఏప్రిల్ 11: పెద్దశంకరంపేటలో మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో బీజేపీ పేట పట్టణ నాయకులు శ్రావణ్‌కుమార్, శ్రీహరి, బుగుడాల కృష్ణ, తదితరులు జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ విజయం కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. అదే విధంగా టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట గ్రామంలో మండల బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించామని మండల పార్టీ అధ్యక్షుడు నవీన్ గుప్తా తెలిపారు. అల్లాదుర్గం మండలం మాందాపూర్ గ్రామంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాళ్ల రాములు పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు గౌడ్, కృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సన్నాహక సమావేశానికి మంత్రులు

నర్సాపూర్, ఏప్రిల్ 11: పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం ఈ నెల 12వ తేదీన నర్సాపూర్‌లోని సాయి కృష్ణ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డిలు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు కొండాసురేఖ, దామోదర్‌రాజనర్సింహ, పార్లమెంటు అభ్యర్థి నీలంమధుతో పాటు పలువురు హాజరుకానున్నట్లు అందువల్ల నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు రావాలన్నారు.

గజగట్లపల్లిలో వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

మెదక్, ఏప్రిల్ 11: చిన్నశంకరంపేట మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో గురువారం వేంకటేశ్వర కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వారికి అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు



మనేపల్లి ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 11: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి , నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మనేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో ప్రయాణించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుహాసినీరెడ్డి, నరేందర్ రెడ్డి, పోలిరెడ్డి, శంకరయ్య మాజీ సర్పంచ్ రామకృష్ణ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్ రావుకు మద్దతుగా బీజేపీ బైక్ ర్యాలీ

మెదక్, ఏప్రిల్ 11: మాసాయిపేట మండల కేంద్రంలోని బీజేపీ పార్లమెంటరీ కార్యాలయం నుంచి పార్టీ మండలాధ్యక్షుడు పాపన్న గారి వేణు ఆధ్వర్యంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి రఘునందన్‌రావుకు అనుకూలంగా నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మాసాయిపేట నుంచి మెదక్‌లోని రాందాస్ చౌరస్తా వరకు కొనసాగుతుందని బీజేపీ నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాములు నాయక్, వేణు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొల్చారంలో శ్రీకాళికాదేవి అమ్మవారిని ఊరేగిస్తున్న విశ్వ బ్రాహ్మణులు

కాళికాదేవికి విశ్వబ్రాహ్మణుల పూజలు

కొల్చారం, ఏప్రిల్ 11: ప్రజలంతా సుఖసంతోషాలతో, సమృద్ధిగా పాడిపంటలు పండాలని శ్రీకాళికాదేవి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నట్లు మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వడ్ల ప్రభాకర్‌చారి తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకుని గత మూడు రోజులుగా విశ్వ బ్రాహ్మణులు తమ పరికరాలను అమ్మవారి దగ్గర ఉంచి పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పల్లకిలో చెరువులోకి శావ నిమిత్తం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు చెందిన మహిళలు అమ్మవారికి నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో పాండురంగాచారి, క్రిష్ణమూర్తి, శివకుమార్, నర్సింహులు, వీరస్వామి, సిద్దిరాములు, దశరథం, శ్రీనివాస్‌చారి, సిద్దిరాములు చారి తదితరులు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో ఉద్యమిద్దాం

మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతిని పురస్కరించుకుని గురువారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పలు సంఘాల ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం పోరాడుదామని యువతకు పిలుపునిచ్చారు.



జహీరాబాద్: పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాసంఘం, బీఆర్ఎస్ నాయకులు



మెదక్ అర్బన్: పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

జహీరాబాద్, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని గురువారం జహీరాబాద్ పట్టణంలో ఎస్సీకార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం, టీబీఎస్ రాష్ట్ర నాయకుడు తులసీరాంరాథోడ్, సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ ఆధ్వర్యంలో వేర్వేరుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **పటాన్‌చెరు:** పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్, నాయకులు విజయ్‌కుమార్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా పటాన్‌చెరు పట్టణంలో కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలంమధు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, మాణిక్యం పాల్గొన్నారు.

● **వట్‌పల్లి:** వట్‌పల్లిలో పలు సంఘాల ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు బి జనార్దన్, అంబేడ్కర్ యువజన సంఘాల ప్రధాన కార్యదర్శి గోరేకల్ దాస్, సొసైటీ మెంబర్ బుద్ధిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు

● **రామచంద్రాపురం:** రామచంద్రాపురంలో జీహెచ్ఎంసీ 111, 112వ డివిజన్ కార్పొరేటర్లు సంధుఆదర్శ్ రెడ్డి, పుష్పానగేష్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎడ్ల రమేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

● **కల్హేర్:** మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు బైండ్ల అశోక్, సంఘం బాధ్యులు ఎర్ర సాయిలు, రవిందర్, మహిపాల్, సాయిలు పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహ అవరణలో గురువారం జ్యోతిబాపూలే జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు నర్సింలు, హన్మండ్లు, బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ తదితరులు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **మెదక్ అర్బన్:** అణగారిన వర్గాల ఆశాజ్యోతి, స్త్రీ విద్యకు బాటలు వేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, నాయకులు మధు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● **చేగుంట:** మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, మండల అధ్యక్షుడు రావుల వెంకటేష్, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తపస్ నాయకులు పాల్గొన్నారు.

● **నిజాంపేట:** మండల కేంద్రంలో దళితబహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొమ్మాట బాబు, బైండ్ల నందు, గుడ్ల బాబు, గరుగుల రాజు, నాయక్, చందు పాల్గొన్నారు.

● **నర్సాపూర్:** నర్సాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి బీజేపీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, బీఏపీ జిల్లా ప్రధానకార్యదర్శి గోదరాజేందర్, కౌన్సిలర్ యాదగిరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వెంకటేశం, సిబ్బంది పాల్గొన్నారు.